క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయి, శ్రీకృష్ణుల రథోత్సవం



కొవ్వలిలో షిర్డి సాయి, శ్రీకృష్ణుడి రథోత్సవం

దెందులూరు: పుణ్యమైన కార్తీకమాసంలో గ్రామ కళ్యాణార్థం, లోకరక్షణ కోసం షిర్డీ సాయిబాబా, బాలరామకృష్ణ రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివార్లకు విశిష్ట పూజలు చేసి ఉత్సవ మూర్తుల ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు, భవానీ దీక్షాధారులు, సాయిబాబా భక్తులు, మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఆధ్యాత్మిక గురువు ఆగం సత్యనారాయణ, గన్నవరపు రాజా, అట్లూరి సుబ్రహ్మణ్యం, ఇస్కాన్ భక్త బృందం పాల్గొన్నారు.

నేటి నుంచి పరిశుద్ధ మాత మహోత్సవాలు

దెందులూరు: దోసపాడులో నేటి నుంచి పరిశుద్ధ మాత నిత్యసహాయమాత మహోత్సవాలు ప్రారంభిస్తారని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ.డేవిడ్ రాజు అన్నారు. గురువారం ఉదయం జెండా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 14,15,16 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తామని ఫాదర్ డేవిడ్ రాజు వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పెదవేగి : రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం పెదవేగి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహానికి అంగన్‌వాడీ సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు జే గోపి, పి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,03,000 మంది అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేస్తున్నారని ఆయన అన్నారు. సెక్టార్ లీడర్లు కృష్ణవేణి, వీ.బేబీ రాణి, కె నిర్మల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది దీక్ష

దెందులూరు: న్యాయబద్ధమైన సమస్యల పరిష్కరించాలని దెందులూరు మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం దీక్షలు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు దీక్షలు చేస్తామని, వేతనాల పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డీఎస్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.


తిమ్మాయిపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న మాలతీరాణి

ఉంగుటూరు: వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం తిమ్మాయపాలెంలో బుధవారం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాద్రి శ్రీదేవి, రైతు సలహా మండల చైర్మన్ పీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆంజనేయులు, జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు అడప శోభారాణి పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం



ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గోపీనాథ్ పట్నం, గొల్లగూడెం గ్రామాలలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకి ప్రజలు హాజరు కాగా, డీటీ పోతురాజు, ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొని అవగాహన కల్పించారు.

వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆదేశించారు. స్థానిక పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆయన బుధవాం సందర్శించారు. వృద్ధులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, వైద్యసదుపాయాలు, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ పై అవగాహన కల్పించారు. సహాయం పొందాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గుండుగొలనులో గడపగడపకు మన ప్రభుత్వం



గుండుగొలను సంతమార్కెట్ ఏరియాలో సంక్షేమ లబ్ధి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను బుధవారం ఎమ్మెల్యే వాసుబాబు ఆధ్వర్యంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో వాసుబాబుకు ఘన స్వాగతం పలికారు. నాలుగన్నర ఏళ్లుగా అమలు చేస్తున్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను ఆయన ఇంటింటికీ వెళ్లి అందించారు. పథకాలు పొందే తరుణంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారా అంటూ లబ్ధిదారుల నుంచి ఆరా తీసారు. గుండుగొలనులోని దశాబ్దాలుగా సొంతిల్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్న మాకు సొంతగూడు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటామని, గుండుగొలను అభివృద్ధికి వాసుబాబు చేస్తున్న కృషిని వారంతా ముక్తకంఠంతో అభినందించారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను మిగిలిన రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకునేందుకు శ్రీకారం చుడుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నరవేర్చేందుకు జగనన్న మానస పుత్రికలైన వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అవినీతిరహితంగా పథకాలను అందించడమే ఈ వ్యవస్థ లక్ష్యమన్నారు. ఇంటింటికీ సంక్షేమ పాలనను అందించడం ద్వారా ప్రజలంతా రెండోసారి జగనన్నను సీఎం చేయాలన్న దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. గ్రామంలోని అపరిష్కృత సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కారిస్తానన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేయాలని, ప్రజలందరి దీవెనలు మెండుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ మద్దుల రాజా, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వర రావు, జిల్లా నేత వగ్వాల అచ్యుతరామారావు, లక్ష్మీపురం సర్పంచ్ దండు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ నత్తా నాగిని, వార్డు సభ్యుడు గొటికల మురళీ, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ జహీర్, నాయకులు నంద్యాల సుబ్బరాజు, నత్తా నరసింహులు, అంబటి నాగేంద్ర ప్రసాద్, నాగనబోయిన కృష్ణ, డోకల సుబ్రహ్మణ్యం, వేములమంద శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద పాదయాత్రను విజయవంతం చేయాలి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేపట్టనున్న ప్రజా ఆశీర్వాద పాదయాత్రను వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు కోరారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు ప్రజా ఆశీర్వాద పాదయాత్ర కొనసాగుతుందన్నారు. దుగ్గిరాల నుంచి దెందులూరు వరకు రెండు మండలాల్లో 23 గ్రామాల్లో 9 రోజులు పాటు జరిగే ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో ఈ ఐదేళ్లలో సీఎం జగనన్న ఆశీస్సులతో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించి వారి ఆశీర్వాదం పొందేందుకే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఈ యాత్ర చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు ప్రజలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కొఠారు రామచంద్రరావు కోరారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు

ఉంగుటూరు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఉంగుటూరు మండలం తల్లాపురం, అప్పారావుపేట గ్రామాల సచివాలయం పరిధిలో బుధవారం పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాలు నిర్వహించారు. తల్లాపురం, అప్పారావుపేట గ్రామాలకు సంబంధించి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ.11 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడా మంగారావు తెలిపారు. వీటిలో సంక్షేమం రూ.9.42 కోట్లు, అభివృద్ధికి రూ.1.58 కోట్లు వెచ్చించారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ గత ప్రభుత్వం వైఫల్యాలను, ఈ నాలుగున్నరేళ్ల కాలంలో జగనన్న పనితీరుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పుప్పాల గోపి, మాజీ సర్పంచ్ కల్లాపురం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైడిముక్కల రామకృష్ణ, సచివాలయం కన్వీనర్ గంటా పెద్దిరాజు, అప్పారావుపేట మాజీ సర్పంచ్, సచివాలయ కన్వీనర్ మరణ పెద్దిరాజు, వార్డ్ మెంబర్ బాల నాగరాజు, పంచాయతీ సెక్రటరీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న సంకు నాగశేషు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నిడమర్రు మండలం బువ్వనపల్లికి చెందిన సంకు నాగశేషుని నియమిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంబంధిత కమిటీ జాబితాను మంగళవారం రాత్రి విడుదల చేసారు. బుధవారం తాడేపల్లిలో నూతన రాష్ట్ర యూత్ వింగ్ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన సంకు నాగశేషు ఆ వింగ్ నూతన అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని ఘనంగా సన్మానించి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంకు నాగశేషు మాట్లాడుతూ స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీలుగా రాష్ట్ర వ్యాప్తంగా 18 మందిని ఎంపిక చేయగా ఏలూరు జిల్లా నుంచి తనకు అవకాశం దక్కడంపై జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నానికి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు, జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని, నియోజకవర్గం యూత్ వింగ్‌లు, మండల యూత్ వింగ్‌లకు సమర్థవంతమైన యువతను సభ్యులుగా ఎంపిక చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి పదవి చేపట్టేల కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ శ్రేణులు తాడేపల్లి సమావేశానికి హాజరయ్యారు.

15నుంచి 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం



ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృపావరం

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు అన్నారు. దెందులూరు ఎంపీడీఓ భీమరాజు అధ్యక్షతన నిర్వహించిన ఆడుదాం ఆంధ్రపై సమీక్ష సమావేశంలో దెందులూరు జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులను వెలికితీసి వారి ప్రతిభకు మరింత పదును పెట్టి క్రీడల్లో తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్పందన, ఎమ్మెల్యే కార్యాలయం వినతులపై అన్ని శాఖల అధికారులు సకాలంలో స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో దోసపాడు, ఇతర గ్రామాల నుంచి మహిళలతో గ్రామాలవారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

ప్రతిభకు గవర్నర్ పురస్కారం



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా ఆదర్శ రైతు పురస్కారం అందుకుంటున్న చల్లా సత్యనారాయణ గౌడ్, శీలం నాగదుర్గ, కోటే నాగమల్లేశ్వరమ్మ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా పురస్కారాలు అందుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గవర్నర్ హోదాలో మొదటిసారిగా దెందులూరు నియోజకవర్గానికి వచ్చారని తెలిపారు. ఉత్తమ సర్పంచ్ అవార్డును గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, ఉత్తమ రైతుగా రాయన్నపాలెంకు చెందిన చల్లా సత్యనారాయణ గౌడ్, ఉత్తమ పాడుపు సంఘం సభ్యురాలిగా కొవ్వలికి చెందిన శీలం నాగదుర్గకు పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన



ఏపూరులో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న అప్పన ప్రసాద్, ఘంటా ప్రసాదరావు

పెదపాడు: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్లు దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు, సర్పాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు చేసిన సేవలను నాయకులు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలు అందించిన వివరాలతో కూడిన బోర్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలపై అభిప్రాయాలను సేకరించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీ బెజవాడ శిరీషా, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవకుమార్, తేరా ఆనంద్, రెడ్డి రంగారావు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లను వినియోగించడం సిగ్గు చేటు

ఏలూరు (టూటౌన్) : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఐఏఎస్ అధికారులను వినియోగించడం సిగ్గు చేటని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ పేర్కొంది. ఈమేరకు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐఏఎస్ అధికారులు, అన్ని శాఖల గ్రూప్ వన్, టూ అధికారులను వినియోగించడం గర్హనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అసలు ఈ రాష్ట్రానికి ఏం చేసిందని సిగ్గు లేకుండా ప్రచారం చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి గెలిచేందుకు ఐఏఎస్, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులను వినియోగించుకోవటం అభ్యంతరకరమని తెలిపారు. షెడ్యూల్ ప్రాంత గిరిజనుల సమస్యలపై రాజ్యాంగ ప్రకారం పర్యవేక్షించాల్సిన గవర్నర్ ఏనాడూ ఆ పనులు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఒక రాజకీయ నాయకునిలా రంగంలోకి దిగటం హాస్యాస్పదమని ఆరోపించారు. తక్షణం ఈ తప్పుడు వైఖరిని సరిచేసుకోవాలని తమ రాజకీయ ప్రయోజనాలకు ఐఏఎస్, జిల్లా అధికారులను వినియోగించుకోవటం ఆపాలని రవి డిమాండ్ చేశారు.

వైభవంగా పోలి స్వర్గం



భీమడోలులోని గోదావరి నదీలో దీపాలను వదలుతున్న మహిళ భక్తులు



దీపదానాలు చేస్తున్న భక్తులు

భీమడోలు: పోలి పాడ్యమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం ముగిసిన తర్వాత వచ్చే పోలి స్వర్గం పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు, పాతూరు, గుండుగొలను గ్రామాల్లోని మహిళలు గోదావరి కాల్వ గట్లపై అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి జలమాతకు నమస్కరించి నదీ జలాల్లో వదిలి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులు తన మొక్కులు చెల్లించారు. అనంతరం శివాలయాలు, విఘ్నేశ్వర, కనకదుర్గా దేవాలయాల్లో స్వామి వార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేసారు. అనంతరం దానాలు చేసారు.

15 నుంచి ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎర్నస్టిన్ ఫెర్నాండెజ్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 1953వ సంవత్సరంలో స్థాపించిన తమ కళాశాల విద్యా సేవలో 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఈ సందర్భంగా ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ విద్యా సంస్థ ప్రారంభించారన్నారు. తమ కళాశాల 36 సంవత్సరాల క్రితమే ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి అటానమస్ కళాశాలగా, దేశంలోనే 8వ అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు. తమ కళాశాల లక్షలాదిమంది మహిళలను విద్యావేత్తలుగా తీర్చిదిద్దిందని చెప్పారు. ఈ నెల 15,16 తేదీల్లో జరిగే ప్లాటినమ్ జూబ్లీ వేడుకల్లో తమ కళాశాల పూర్వ విద్యార్థులైన హోంశాఖ మంత్రి తానేటి వనిత, ఇస్రో చంద్రయాన్ 3 అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన కాళహస్తి, ఏపీ స్పెషల్ పోలీస్ డీఐజీ బి.రాజకుమారి, ఐఏఎస్ అధికారి వై.జయ ప్రియదర్శిని, సినీనటి, గాయని స్నిగ్ధ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రం విడుదల చేశారు. కళాశాల పరిపాలనాధికారి ఇన్నాసమ్మ, కెమిస్ట్రీ హెచ్‌ఓడీ సీఏ జ్యోతిర్మయి, హిందీ, తెలుగు హెచ్‌ఓడీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

టీ షర్టులు, బాక్సుల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు పరిసర ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం టీ షర్టులు, హాట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ క్రీడల సందర్భాల్లో ధరించడానికి వీలుగా టీ షర్టులు పంపిణీ చేశామన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన 160 మందికి టీషర్టులు, హాట్ బాక్సులు అందజేశామని తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎం మాలతీ దేవి, బీసీహెచ్ దుర్గాంబ, ఎస్ జై కుమార్, ఎస్ రాజు, పాఠశాల విద్యాకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళలను ఆదరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చేనేత, హస్తకళలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో క్రాఫ్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాలతో పాటు బెంగాలీ కాటన్, సహరన్ పూర్ కలప వస్తువులువంటి ఎన్నో వస్తువులను ఈ ప్రదర్శనలో ఉంచామని, ఇది సంక్రాంతి పండుగ వరకు ప్రజలకు అందబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా కోరింది. ఈ మేరకు బుధవారం స్థానిక జిల్లా కార్యాలయం నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ కొద్ది సేపు ధర్నా చేశారు. ఈ మేరకు కలెక్టర్ వె.ప్రసన్న వెకంటేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కోడూరి లక్ష్మీనారాయన, విక్రమ కిషోర్, పెన్మత్స రామచంద్రరావు, నడపన దానభాస్కరరావు, ఇలపకుర్తి కుసుమ కుమారి, నాగం శివ, గాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

టి.నరసాపురం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని టి.నరసాపురం ఎంపీపీ స్కూల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు. ఎంఈఓ రామ్మూర్తి, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఎంఈఓలకు డీవైఈఓలుగా పదోన్నతి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హైకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో మండల విద్యాశాఖాధికారులకు ఉప విద్యా శాఖాధికారులుగా పదోన్నతి కల్పించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎంఈఓల పదోన్నతులకు సంబంధించిన విధివిధానాలు సరిగాలేని కారణంగా ఏళ్ల తరబడి పదోన్నతులు నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును అనుసరించి విద్యాశాఖలో పని చేసి బోధనానుభవం గల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు మాత్రమే ఉప విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించాల్సి ఉందని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా 1న జీతాలు చెల్లించాలని, పాఠశాల నిర్వహణ నిధులను వెంటనే విడుదల చేయాలని, పాఠశాలల్లో పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సలహాదారుడు మరడాని అచ్యుతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర రావు, ఉదయ భాస్కర్, ఆర్ నాగేంద్ర సింగ్, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.